క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



నర్మెట : స్థానిక కాశీ విశ్వనాథ ఆలయ అభివృద్ధికి దేవులపల్లి లక్ష్మి–లక్ష్మయ్య పటేల్ పేరు మీద కుమారుడు, కోడలు హరిప్రియాదేవి–దామోదర్ పటేల్ రూ. 1,00,116ల విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ చైర్మన్ గంగం నర్సింహారెడ్డికి అందించారు. కార్యక్రమంలో జంగిటి ఆంజనేయులు, భాగ్యలక్ష్మి, ప్రతాప్, శ్రీధర్, గణేష్, బాలయ్య, యాదగిరి, ఐలయ్య, రాజు పలువురు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరిస్తా..



కొడకండ్ల : పుట్టిన ఊరుకు సేవ చేయడం ఆనందంగా ఉంది.. గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని దివంగత మాజీ ఎమ్మెల్యే కుందూరు మధుసూదన్‌రెడ్డి కుమార్తె ఎన్ఆర్ఐ స్వర్ణదామోదర్‌రెడ్డి అన్నారు. స్థానిక అయ్యప్ప సొసైటీ ఆధ్వర్యాన చేపట్టిన ఆలయ నిర్మాణ పనులను ఆమె శనివారం పరిశీలించారు. తనవంతు సహాయంగా రూ.10 లక్షల విరాళం ప్రకటించి వెంటనే రూ.5 లక్షల చెక్కును కార్యవర్గానికి అందజేశారు.

నేడు సన్మానం

బచ్చన్నపేట : ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటైన కొడవటూర్‌ని స్వయంభూ సిద్దేశ్వరాలయ నూతన పాలకవర్గ సభ్యులకు నేడు (ఆదివారం) సన్మానం చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కమిటీ సభ్యులకు ఆలయ ప్రాంగణంలో జరిగే కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

యుద్ధభేరిని విజయవంతం చేయాలి

తరిగొప్పుల : వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజి గ్రౌండ్ నేడు (ఆదివారం) జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని జనగామ నియోజకవర్గ ముదిరాజ్ మహాసభ ఇన్‌చార్జ్ చిలువేరు లింగం పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ పెంచి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

యూత్ కమిటీ మండల అధ్యక్షుడిగా గణేశ్



లింగాలఘణపురం : మండలంలోని వడిచర్లకు చెందిన దయ్యాల గణేశ్ కురుమ సంఘం మండల యూత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఐల రమేష్, దాయ నాగేశ్, బుగ్గ పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శిగా బర్ల అనిల్‌కుమార్, కోశాధికారిగా కేమిడి రమేష్, సంయుక్త కార్యదర్శులుగా నాగరాజు, అనిల్, రాజు, సభ్యులను ఎన్నుకున్నారు.

రజక సంఘం పట్టణ కమిటీ



వెంకటయ్య, అధ్యక్షుడు

బచ్చన్నపేట : పట్టణ రజక సంఘం నూతన కమిటీని శనివారం స్థానిక దుర్గామాత ఆలయం వద్ద ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవరకొండ వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి పెనిమెల్లి భానుచందర్, ఉపాధ్యక్షులు పోంపల్లి సిద్దులు, యూత్ అధ్యక్షులు మేడిచెలిమి రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పెద్దమనుషులు వెంకటయ్య, కిష్టయ్య, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

పాలకుర్తి టౌన్ : మండలంలోని దర్దేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను దాతలు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, చుక్క రామయ్య ఫౌండేషన్ అధ్యక్షుడు మాచర్ల పుల్లయ్య పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం డాక్టర్ వెంకటేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్గీకరణకు పాటు పడాలి

బచ్చన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణకు పాటు పడాలని ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు అల్వాల నర్సింగారావు అన్నారు. శనివారం మండల కేంద్రం నుంచి జనగామలో మంద కృష్ణ మాదిగ నిర్వహించే సన్నాహక సమావేశానికి నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న జరుగబోయే వేయి గొంతులు లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అల్వాల రాజు, విజయ్‌కుమార్, చిరంజీవి, సిద్దులు, భిక్షపతి, శ్రీను పలువురు పాల్గొన్నారు.

అర్ధాకలితోనే.. ప్రత్యేక తరగతులకు

- టెన్త్ విద్యార్థులకు అందని అల్పాహారం
- దాతలు సహకరించాలని కోరుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



రాజవరం పాఠశాలలో ప్రత్యేక తరగతి వింటున్న విద్యార్థులు

చిల్పూరు : పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నవంబర్ నుంచి ఉదయం 8:30 నుంచి 9:30 గంటలవరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు తీసుకుంటున్నారు. అయితే విద్యార్థులు ఉదయం పూట ఖాళీ కడుపుతో తరగతులకు హాజరు కావాల్సి వస్తోంది. అల్పాహారం అందక ఆకలితో చదువుపై సక్రమంగా శ్రద్ధ పెట్టలేక పోతున్నామని విద్యార్థులు చెబుతున్నారు.

మధ్యాహ్న భోజనంతోనే హాజరు..

మండలంలో తొమ్మిది ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, జ్యోతినికేతన్ పాఠశాలలు ఉండగా పదో తరగతిలో 300 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులు ఉదయమే ప్రత్యేక తరగతులకు పాఠశాలకు వస్తుండడంతో అదే సమయానికి ఇంట్లో వంట కాకపోవడంతో ఖాళీ కడుపుతోనే హాజరవుతున్నారు. జ్యోతినికేతన్ పాఠశాలలో మినహా ఎక్కడ అల్పాహారం లేకపోవడంతో మధ్యాహ్న భోజనంపైనే విద్యార్థులు ఆధారపడుతున్నారు.

దాతలు సహకరించాలి..

గతేడాది ప్రారంభంలో పలు పాఠశాలల్లో దాతల సహకారంతో విద్యార్థులకు అల్పాహారం అందింది. అనంతరం ప్రభుత్వం స్పందించి అల్పాహారం కోసం ప్రత్యేక నిధులను విడుదల చేసింది. ప్రస్తుతం ప్రత్యేక తరగతులు మొదలై నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఎవరూ కూడా అటువైపు దృష్టి సారించడం లేదు. దాతలు స్పందించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, కోరుతున్నారు.

దృష్టి సారించలేక పోతున్నా..



పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలన్నదే నా లక్ష్యం. అయితే పొద్దున్నే ఇంట్లో ఏమి వండి పెట్టరు. దీంతో ఖాళీ కడుపుతోనే ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నా. ఆకలితో పాఠ్యాంశాలపై దృష్టి సారించలేక పోతున్నా. దాతలు సహకరించి అల్పాహారం అందజేస్తే మాకెంతో మేలు జరుగుతుంది.

– చిన్న, పదో తరగతి

దాతలు ముందుకు రావాలి..



విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న సందర్భంగా ప్రభుత్వం నుంచి అల్పాహారానికి నిధులు మంజూరు చేసే వరకు దాతలు ముందుకు రావాలి. గతంలో దాతల సాయంతో అల్పాహారం అందించే వాళ్లం. పిల్లల శ్రేయస్సు కోసం దాతలు ముందుకు రావాలి.

– దాసరి గోవర్ధన్, ఎంఈఓ

అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలి

- కలెక్టర్‌కు సీపీఎం నాయకుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్: పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల వద్ద నిర్మిస్తున్న బైపాస్ రోడ్డుపై అండర్‌పాస్ బ్రిడ్జిని నిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాకు పార్టీ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బోడ నరేందర్ మాట్లాడుతూ ఏసీరెడ్డి నగర్, ఇందిరమ్మ, డబుల్ బెడ్‌రూమ్, మూడో విడత కాలనీ, ఎల్లముల, పెంబర్తి సిద్దంకి, పెదరాంచర్ల, చౌదర్పల్లి శ్రీనివాస్‌పురం, పోచన్నపేట గ్రామాలను కలుపుతూ ఉన్న బీటీ రోడ్డు ఎన్‌హెచ్ 163 హైదరాబాద్ టు వరంగల్ బైపాస్ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ రహదారిలో అండర్‌పాస్ బ్రిడ్జి లేకపోవడం వల్ల ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడనున్నారన్నారు. అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం సీపీఎం చేపట్టిన దీక్షలు 9వ రోజుకు చేరున్నాయి. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గోపి, ప్రకాష్, లక్ష్మి, నరసింహా రెడ్డి, మల్లయ్య, ఉపేందర్, మున్నీర్, అరుణ, మంజుల, నాగమణి, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

భూములకు హద్దులు వేసి బోర్డు పెట్టాలి

జఫర్‌గఢ్ : మండలంలోని ఉన్న ప్రభుత్వ భూములకు హద్దులు వేసి బోర్డులు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, నాయకులు వడ్లకొండ సుధాకర్ కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏఓ మన్సూర్‌కు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పార్టీ నాయకులు వేల్పుల పెద్ద రాములు, ఎండి షబానా, శృతి, చిన్న రాములు, యాకన్న, శంషోద్దిన్, తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి



సీసీ రోడ్ల నిర్మాణానికి మార్కింగ్ పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని ఇప్పగూడెంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో చేపడుతున్న అభివృద్ధి పనులకు రాజకీయ పార్టీలకతీతంగా అందరూ సహకరించాలని కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గౌడుగు రాజయ్య, జిల్లా నాయకులు మంద రాజు, పల్లె రవీందర్‌గౌడ్ అన్నారు. ఇప్పగూడెంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.75 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనుల కోసం పంచాయతీరాజ్ ఏఈ రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం మార్కింగ్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే రాజకీయాలు అని, అభివృద్ధిలో అందరూ కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగనబోయిన శ్రీను, మేదరబోయిన కుమార్, కత్తుల మల్లయ్య, రాజయ్య పాల్గొన్నారు.

నెల రోజులు దాటినా బోనస్ పడలేదు

- ఇప్పగూడెంలో బాధిత రైతుల ఆవేదన



మాట్లాడుతున్న బాధిత రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్ : గ్రామంలోని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో వరిధాన్యం విక్రయించి దాదాపు 40 రోజులు గడుస్తున్నా ఇంతవరకూ సన్నధాన్యానికి సంబంధించిన బోనస్ డబ్బులు రాలేదని రైతులు కత్తుల సుధాకర్, సుజ్ఞాన్‌రెడ్డి, బి.రమణారెడ్డి అన్నారు. మండలంలోని ఇప్పగూడెంలో శనివారం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఎండీ.మైబఎపాషా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాధిత రైతులు విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో 1700 బ్యాగ్‌లకు చెందిన బోనస్ రావాల్సి ఉందన్నారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులను సంప్రదించినా ఫలితం లేదని, రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి రైతుల బోనస్‌లు అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో రైతులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సయ్య, గురువయ్య, రాజయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

చిల్పూరు : ద్విచక్రవాహనంపై తీసుకెళ్తుండగా వాహనాన్ని స్వాధీనం చేసుకుని గుగులోతు నరేశ్‌ను అరెస్టు చేసినట్లు స్టేషన్‌ఘన్‌పూర్ ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు తెలిపారు. మండలంలోని కొండాపూర్ శివారులో జిల్లా ప్రొహిబిషన్ అధికారి ఆదేశాల మేరకు శనివారం రూట్‌వాచ్ నిర్వహించగా ద్విచక్ర వాహనంపై కొండాపూర్ పరిధిలోని ఎర్రకుంట తండాకు చెందిన నరేశ్ అనుమానాస్పదంగా వెళ్తుండగా వెంబడించి పట్టుకుని సోదా చేశారు. అతని వద్ద 6 లీటర్ల గుడుంబా లభించడంతో స్వాధీనం చేసుకుని, ద్విచక్ర వాహనం సీజ్‌చేసి అతన్ని అరెస్టు చేసినట్లు తెలిపారు. రూట్‌వాచ్‌లో సుధామాధురి, రాజేష్‌బహదూర్, సోమేశ్వర్, శ్రవణ్‌కుమార్, శ్రీనివాస్‌రావు, దస్తగిరి, సలీమ్ పాల్గొన్నారు.

ఘనంగా భక్త మార్కండేయ జయంతి



బచ్చన్నపేట మార్కండేయ ఆలయంలో హోమం కాల్చుతున్న పద్మశాలీలు

పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో జఫర్‌గఢ్, చిల్పూరు, పాలకుర్తి, బచ్చన్నపేట మండలంలో భక్త మార్కండేయ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో చిల్పూరు ఎస్సై నవీన్‌కుమార్, అర్చకులు, పద్మశాలి సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



చిల్పూరు : ఉత్సవాల్లో పాల్గొన్న పద్మశాలీలు



జఫర్‌గఢ్‌లో..



పాలకుర్తి టౌన్ : భక్తమార్కండేయ చిత్రపటానికి పూల మాలవేస్తున్న సుధాకర్

సంక్షిప్త సమాచారం

సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొడకండ్ల : విద్యార్థుల అభ్యున్నతి కోసం దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ కోరారు. పాకాలకు చెందిన వీరారెడ్డి జగన్మోహన్ రెడ్డి జ్ఞాపకార్థం అతని కుమారులు రామ్‌కిషన్‌రెడ్డి, హరికిషన్‌రెడ్డిలు విద్యార్థులకు అందించిన స్కూల్ బ్యాగ్‌లను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు.

గౌడ సామాజిక అభ్యున్నతికి పాటుపడాలి

దేవరుప్పుల : గౌడ సామాజిక అభ్యున్నతి కోసం విద్యావంతులు పాటుపడాలని గౌడ ఐక్య సాధన సమితి జనగామ జిల్లా అధ్యక్షుడు తండ రమేష్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు బూడిద ప్రశాంత్ గౌడ్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు.

సోనియా గాంధీ దిష్టిబొమ్మ దహనం

పాలకుర్తి టౌన్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై ప్రతిపక్షనేత సోనియాగాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శనివారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో బీజేపీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో సోనియాగాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్, రవికుమార్,తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఉత్సవాలను విజయవంతం చేయాలి



జనగామ రూరల్: ఈ నెల 4న జనగామలో సీపీఐ వందేళ్ల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజారెడ్డి తెలిపారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించేందుకు వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేడుకలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు సాయన్న, శ్రీనివాస్, సోమయ్య, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ విద్యాలయంలో మాక్ అసెంబ్లీ

పాలకుర్తి టౌన్ : మండల కేంద్రంలోని సిద్ధార్థ విద్యాలయంలో శనివారం మాక్ అసెంబ్లీ నిర్వహించా రు. విద్యార్థులే రాజకీయ నాయకులయ్యారు. ఒక సీఎం, మరొకరు డిప్యూటీ సీఎం, ఇంకొకరు ప్రతిపక్ష నేత మరికొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు.వారి మధ్య వాద ప్రతివాదాలు ఆలోచింపజేసే చర్చలు జరిగాయి. ప్రిన్సిపాల్ జక్కుల రవీందర్, కరస్పాండెంట్ ఊర్మిళ నేతృత్వంలో 9వ తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్‌గా శివప్రసాద్, సీఎంగా ఆఖిల్, స్పీకర్‌గా హర్షిణి, డిప్యూటీ సీఎంగా సుప్రియ, ప్రధాన ప్రతిపక్ష నేతలుగా మెరుగు అభినయ్‌రామ్, వేణు, వివేక్, యశ్వంత్‌లు వ్యవహరించారు.

సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు

జఫర్‌గఢ్ : మండలంలోని తిమ్మంపేట 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపట్టినట్లు ఏఈ విశ్వసాయితీ తెలిపారు. రానున్న వేసవిలో విద్యుత్ వాడకం పెరగనుండడం వల్ల ఎలాంటి సమస్య తలెత్తకుండా అదనపు లోడ్ నివారణకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా సిబ్బందితో కెపాసిటర్ల బిగింపు పనులు చేపట్టినట్లు ఆమె తెలిపారు.

ఆర్థికసాయం

నర్మెట : మండలంలోని ఉప్పబాయి తండాకు చెందిన ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు నూనావత్ రాజ్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ రూ. 5వేలను అందించారు. శనివారం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో గాయపడ్డ రాజ్‌కుమార్‌ను పరామర్శించారు. ఆయన వెంట లక్ష్మీనారాయణ, బాలచందర్, జయరాం, రమేష్, వెంకట్రాం ఉన్నారు.

కొడకండ్ల : మండల కేంద్రానికి చెందిన నిరుపేద చేనేత కార్మికుడు రాపోలు జనార్ధన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పెద్ద దిక్కును కోల్పోయి నిరుపేద కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండగా బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ కార్యదర్శి పసునూరి సురేశ్ చొరవ తీసుకొని సభ్యులతో పాటు దాతల సహకారంతో రూ.12 వేలు పోగుచేసి శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు.

మాజీ మంత్రి పరామర్శ

పాలకుర్తి: మండలంలోని వల్మిడికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మారిపెల్లి అంజయ్య అత్తమ్మ ఇటీవల మృతి చెందగా శనివారం శనివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కత్తి సైదులు, రాజు, రాజయ్య, రాములు, మహాత్మ ఉన్నారు.

డీటీగా అనిల్‌బాబు బాధ్యతల స్వీకరణ

జఫర్‌గఢ్ : డిప్యూటీ తహసీల్దార్‌గా అనిల్‌బాబు పదవీ బాధ్యతలను శనివారం స్వీకరించారు. కొన్నేళ్ల నుంచి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఇక్కడే విధులు నిర్వహిస్తున్న అనిల్‌బాబు ఇటీవల డీటీగా పదోన్నతి పొందడంతో పాటు ఇక్కడనే పోస్టింగ్ రావడం జరిగింది. ఇక్కడ డీటీగా పని చేసిన ఖాసీ నాయక్ జనగామకు బదిలీ అయ్యాడు.

7న సభను జయప్రదం చేయండి

చిల్పూరు: ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలంటూ ఈనెల 7న హైదరాబాద్‌లో తలపెట్టిన లక్ష డప్పులు..వేల గొంతులు సభను జయప్రదం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘాల రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇల్లందుల సుదర్శన్ పిలుపునిచ్చారు. మండలంలోని చిన్నపెండ్యాలలో శనివారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

బచ్చన్నపేట : విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని రామకృష్ణ ఉన్నత విద్యాలయ కరస్పాండెంట్ కరికె ఊర్మిల ప్రసాద్‌బాబు అన్నారు. శనివారం పాఠశాల విద్యార్థులచే వెజిటేబుల్ డేను నిర్వహించారు. కొనుగోలు చేయడానికి వచ్చిన పేరెంట్స్‌కు కూరగాయల ప్రాముఖ్యతను విద్యార్థులు వివరించారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో తులాభారం

జఫర్‌గఢ్ : స్థానిక వేల్పుగొండ కొండ దిగువన ఉన్న లక్ష్మీనర్సింహసీతారామచంద్ర స్వామి ఆలయంలో స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రంగరాయగూడెంకు చెందిన అయిత సాకేత్ కుమారుడైన మోక్షిత్‌తో తులాభారాన్ని శనివారం నిర్వహించారు. 12 కిలోల కాయిన్స్ తులాభారాన్ని నిర్వహించడంతో పాటు స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు.

ఉత్తమ ఉద్యోగికి సన్మానం

పాలకుర్తి టౌన్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా ఎన్పీడీసీఎల్ సీఎండీ చేతుల మీదుగా అవార్డు పొందిన విద్యుత్ శాఖలో లైన్‌ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డిని శనివారం టీఆర్‌వీకేఎస్ స్టేట్ అధ్యక్షులు, జనగామ రీజినల్ సెక్రటరీ వేణు గోపాల్‌రావు, డివిజన్ అధ్యక్షుడు కె రాజలింగం శనివారం సన్మానించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లికార్జున్

బచ్చన్నపేట : వేసవికాలం సమీపిస్తున్నందున మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చామంతి, ఎంపీడీఓ మల్లికార్జున్ అన్నారు. శనివారం మండలంలోని బసిరెడ్డిపల్లి, బండనాగారం గ్రామాల్లో పర్యటించి ఓహెచ్ఆర్ వాటర్ ట్యాంక్‌లు, జీపీ బోర్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి పైపుల లీకేజీలు లేకుండా చూస్తూ నీటి ఇబ్బందులు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. వారి వెంట ఏపీఓ కృష్ణ, పంచాయతీ కార్యదర్శులు నర్సింహాచారి. భరతకిషోర్, ఫీల్డ్ అసిస్టెంట్లు రామకృష్ణ, ఉన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు ‘ప్రజ్ఞోత్సవం’

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రజ్ఞోత్సవ కార్యక్రమాలు దోహద పడుతాయని పలువురు వక్తలు అన్నారు. శనివారం కొడకండ్ల, తరిగొప్పుల, చిల్పూరు, లింగాల ఘణపురం, దేవరుప్పుల, నర్మెట మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మండల స్థాయి ప్రజ్ఞోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆయా పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు, ఎంపీడీఓ, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



చిల్పూరు : గ్రామీణ ప్రాంత వేషధారణలో విద్యార్థులతో ఎంఈఓ



లింగాలఘణపురం: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ విష్ణుమూర్తి



నర్మెట : బహుమతులను అందిస్తున్న ఎస్సై నగేశ్



కొడకండ్ల: బహుమతులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి



తరిగొప్పల : బహుమతులతో విద్యార్థులు



దేవరుప్పల : ప్రజ్ఞోత్సవంలో ఎంఈఓ కళావతి

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



రూప్సీరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దేవరుప్పుల : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ శ్రేణులు సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సూచించారు. శనివారం ఆమె సమక్షంలో చిన్నమడూరు గ్రామశాఖ ఎన్నికపై పాలకుర్తి కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామ అధ్యక్షుడిగా వంగ దశరథం, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, భాస్కర్, నారాయణదాసు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శులుగా వీరస్వామి, సహాయ కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు,యాకన్న, కోశాధికారులుగా శ్రీను, బాలరాజుతో పాటు కన్వీనర్లు యూత్ అధ్యక్షుడు హరీష్ ఎన్నికయ్యారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

జనగామ రూరల్ : ఇంటి స్థలం విషయంలో మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం పట్టణంలోని బాణాపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..కొంత కాలంగా బాణాపురంలోని జగ్గని యాదయ్య(55) ప్లాటుకు సంబంధించిన విషయంలో ఎండీ. ఇక్బాల్, ఎండీ.ఉస్మాన్, మారపాటి ప్రసాద్, బూడిద సంపత్, జనగామ, చేర్యాలకు చెందిన వ్యక్తులు జనవరి 27న బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. దీంతో ఆర్థిక ఇబ్బందులతో సదరు ప్లాటును విక్రయించాడు. ఈ ప్లాటు విషయంలో సంబంధిత వ్యక్తులు మానసిక ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. దీంతో మనస్తాపం చెంది శనివారం ఉదయం 5 గంటల సమయంలో యాదయ్య ఇంటి సమీపంలో వేపచెట్టుకు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దామోదర్‌రెడ్డి తెలిపారు.